

# ది లాస్ట్ డేట్

**— టి.యస్.ఎ. కృష్ణమూర్తి**

"సెంటిమెంటల్ ఫూల్" అని తిట్టేవాడు శరత్; చైతన్య అయితే "నీవో చాంధసవు వెధవ్విరా !"అని విసుక్కునేవాడు "నాకు ఎడమకన్ను అదురుతోందిరా" అని నేను అన్నప్పుడల్లా. మూఢా చారాల పట్ల, పాతనమ్మకాల పట్ల నాకూ అట్టే నమ్మకం లేదు కానీ అదేమిటో వామనేత్రం అదిరి నప్పుడెల్లా నాకేదో నష్టమో, కష్టమో కలగడం పరిపాటి అయిపోయింది నా జీవితంలో

మూడునాలుగు రోజులుగా ఎడమకన్ను తరచుగా అదురుతూనే వుంది ఏం మూడుతుందో ఏమో అని అనుకుంటూ సైకిలు చాల నెమ్మదిగా త్రొక్కుతూ, నడిచేప్పుడుకూడా చాల నెమ్మదిగా నడుస్తూ ఆఫీసులో పైవాళ్లవద్ద చీవాట్లు తినకుండా ఉండడానికి, తద్వారా హార్టు అవకుండా వుండడానికి వెయ్యి జాగ్రత్తలు తీసుకుంటూ, ఎడం చేయిని ఎక్కువ కదిలించకుండా, ఆ చేతికి ఎక్కువ శ్రమ ఇవ్వకుండా చూసుకుంటూ గడిపాను. (నిర్లక్ష్యంగా చేయి ఝాడించినా, బలంగా వేగంగా చేతిని కదిలించినా ఒక్కోపర్యాయం నా ఎడంచేతి భుజంలోని బంతిగిన్నెకీలు డిస్‌లొకేట్ అయి కొన్ని నిముషాల పాటు నన్ను నరకయాతనకు గురిచేసి తిరిగీ యధాస్థానానికి చేరుకుంటుంది. దాని తాలూకు నొప్పి నన్ను రెండుమూడు రోజులు వదలదు ఆపై.)

అయితే నేను భయపడిన ప్రమాదాలు ఏమీ జరగలేదు. కానీ నా గుండెలదిరిపోయేలా ఒక ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం వచ్చి పడింది. 'చైతన్య సీరియస్‌లీ ఇంజూర్‌డ్ ఇన్ ఎన్ ఆక్సిడెంట్. స్టార్ట్ — శరత్' అని వుంది అందులో.

మదనపల్లె నుండీ పలమనేరు రావడాన్కి లైట్నింగ్ సర్వీసు బస్‌లో అయితే ఒకటింపావు గంటా, ప్యాసింజరు బస్‌లో అయితే ఒకటిముప్పావు గంటా పడుతుంది. ఇంత తక్కువదూరం తను స్వయంగా రాకుండా ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం ఇచ్చాడంటే ఏదో పెద్ద ప్రమాదమే జరిగి వుండాలి చైతన్యకు

సూట్‌కేసులోంచీ ఒకజత బట్టలు తీసుకుని హ్యాండుబ్యాగులో ఉంచుకుని, ఉన్న డబ్బు అంతా తీసుకుని జేబులో పెట్టుకుని గదికి తాళంవేసి నేరుగా నేను పని చేసే కంపెనీ ఆఫీసుకు వెళ్ళాను మేనేజరుకు టెలిగ్రాం చూపించి రెండు రోజులు పర్మిషన్ తీసుకుని గబగబా బస్టాండు కేసి నడిచాను.

* * *

'లైఫ్ ఈజ్ ఎ టేల్ టోల్డ్ బై ఎన్ ఇడియట్' అనుకుంటూ కల్లుపల్లికీ, పంజానికీ

కూర్చున్నాను

సదరు నంబరు రాతికి వెనుకగా నేనెక్కిన ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ తాలూకు బస్ పంచరు అయి ఆగిపోయింది. ప్రగతిపథంవైపు పురోగమిస్తున్న ఆ బస్సులో స్టెప్నీ అనబడే స్పేరు టయరు లేదు. (విడి చక్రం బండిలో ఉండి వుండినా దానిని మార్చడానికి కావాల్సిన జాకీ, జాకీరాడ్, వీల్ నట్ స్పానర్ మొదలగునవి బండిలో ఉండవన్నది వేరే విషయం.) ఎక్కడ పంచరు అయితే అక్కడే వాహనము ఆపివేయాలన్న సంస్థ నియమం మేరకు బస్సును ఆపివేసి డ్రయివరు పలమనేరు వెళ్తున్న ఓ బస్ ఎక్కేశాడు—పలమనేరు డిపోనుండీ టయరూ దాన్ని మార్చడాన్కి పరికరాలూ, వాటితోపాటు ఓ మనిషినీ తీసుకురావడాన్కి.

గోడకు కొట్టిన సున్నమైనా తిరిగి వచ్చునేమో కానీ సంస్థ టిక్కెట్ కొట్టడాన్కి కట్టిన డబ్బు సామాన్యంగా ప్రయాణికులకు తిరిగిరాదు. .కనుక.. కండక్టరు రావాల్సిన సంస్థ బస్ కోసం ఎదురు చూస్తున్నాడు తన బస్‌లోని ప్రజలను అందులో కూరడాన్కి.

ఐదు నిముషాల తరువాత మదనపల్లె వెళ్ళే ఒక ప్రయివేటు బస్సు వేగంగా వచ్చింది. కొండంత ఆశతో గబగబా లేచి నిలబడి ఆపాను దాన్ని. నేను

అనుకున్నాడేమో ఆ బస్సు డ్రయివరు... లైనులో ముందు స్టేజిలో వున్న ప్రయాణికులను తన బస్‌లోకి దోచుకోవడాన్కి దూసుకుపోయాడు ఆక్సిలేటర్ మీది కాలు తీయకుండా అదే మోపున బస్ ఆపకుండా.

"ఒరేయ్ చైతన్యా నీకు ఏం జరిగిందిరా ? ఎలా ఉన్నావురా?" అనుకుంటూ వుంటే కళ్లలో నీళ్లు తిరిగాయి. ఉసూరుమంటూ మైలురాతిమీద (చిన్న సవరణ... కిలోమీటరు రాతిమీద) కూర్చున్నాను మళ్లీ—

సదా నవ్వుతూ ఉండే చైతన్య రూపం కళ్ల ముందు మెదిలింది.

* * *

చైతన్య, శరత్, నేనూ ముగ్గురూ కూడా మదనపల్లెలో పుట్టి, అక్కడే పెరిగి, అక్కడే చదువుకున్న వాళ్లమైనా కాలేజి చదువు చివరి రోజుల వరకూ మా మధ్య ముఖపరిచయం తప్ప స్నేహం లేదు.

ఈ ప్రపంచంలో 'స్నేహం' అనేది చాలా విచిత్రమైనది. ఎప్పుడు. ఎలా, ఎక్కడ, ఎవరిమధ్య ఉద్భవిస్తుందో, ఎలా పెరుగుతుందో, ఎలా ముగుస్తుందో, ఎలా నడుస్తుందో ఎవరూ ఊహించలేరు.

పరీక్షల రోజులలో చాలామంది విద్యార్థులకు తమ గదులనుండీ, తమ ఇండ్లనుండీ అర్ధరాత్రప్పుడు అలా చల్లగాలికి నడచివచ్చి చిత్తూరు బస్టాండులోని హోటల్‌లో టీ త్రాగి వెళ్లటం అలవాటు. ఆ అలవాటు మా ముగ్గురకూ ఉండడంవల్ల ఫైనల్ ఇయర్ పరీక్షలు జరుగుతున్నప్పుడు రాత్రి పండ్రెండు ఒంటిగంటల మధ్య ప్రతిరోజూ యాదృచ్ఛికంగా హోటల్‌లో కలిసేవాళ్లం. అప్పుడు ప్రారంభమైంది మా మధ్య స్నేహం. అదీ విచిత్రమే... ఎందుకంటే చైతన్య కామర్సు స్టూడెంటు, శరత్ హార్టికల్చర్ స్టూడెంటు, నేను లిటరేచర్ స్టూడెంటుని. అయినా మేము మా ఆలోచనలని ఒకరికొకరు మార్చుకునే వాళ్లము. ఒకటి రెండు టీలు త్రాగడంలో, కబుర్లలో అరగంట, ముప్పావుగంట గడిచాక తేరుకుని గబగబా ఎవరింటికి వాళ్ళు సాగిపోయేవాళ్ళం.

పరీక్షలు అయిపోయాయి. ముగ్గురం బాగానే వ్రాశాము తరువాత తరచుగా కొత్తపేటలో లైబ్రరీ వద్ద కలిసే వాళ్ళం బి. టి. కాలేజీ గ్రవుండ్సుల్లో హాకీ ఆడేవాళ్ళం మా కాలేజి మిత్రులతో కలసి.

స్నేహం బాగా గట్టిపడింది మా మధ్య. ముగ్గురకూ ప్రకృతి సౌందర్యం అంటే ఇష్టమే ! సాయంకాలం అయేసరికి సైకిళ్ళమీద తిరుపతి రోడ్డులో యర్రగండం మిట్టమీదికో, కదిరి రోడ్డులో అమ్మ చెరువు మిట్టమీదికో వెళ్ళి కూర్చుని ఇటూ అటూ కన్పించే అద్భుతమైన ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ తన్మయంగా గడిపేవాళ్ళం. ప్రతి ఆదివారమూ సైకిళ్ళమీద ఏదో ఒక ప్రదేశానికి వెళ్ళి సరదాగా గడిపి వచ్చేవాళ్ళం. కోళ్ళ బయలు వద్దనున్న వాటర్ ఫాల్సు, అవ్వకోట, వేంపల్లి మల్లయ్యకొండమీదనున్న శివాలయం, చౌడసముద్రం వద్దనున్న పురాతన సోంపాల్యెం దేవాళయం, పుంగనూరులోని నగరూ, ప్రసిద్ధ ఆలయాలూ, చౌడేపల్లి వద్దనున్న పంచలింగేశ్వరాలయం (ఈ లింగాలను స్వయంగా పంచపాండవులు ప్రతిష్ఠించారని ప్రతీతి), హార్సలీహిల్సు, గుర్రం కొండ .. ఇలా ఎన్నో ప్రదేశాలు సైకిళ్ళమీదే తిరిగేశాము.

అప్పుడప్పుడు బసినికొండ ఎక్కేసి గుడిదగ్గరున్న పెద్ద గుండు మీద కూర్చుని వింతసోయగాలతో కన్పించే మా ఊరినీ, దాన్ని చుట్టుముట్టివున్న ప్రకృతి మాత దివ్యమంగళ సుందర రూపాన్ని చూస్తూ మైమరచి పోయేవాళ్ళం.

శరత్ వాళ్ళ మేనమామ వెంకటేశ్వర్లుగారి వద్ద ఒక పాత ట్రంపు మోటారు సైకిలు వుండేది ఆ రోజులలో. ఆయన ఊర్లో లేని సమయాలలో దాన్ని తీసుకుని వచ్చేసేవాడు శరత్. దానిమీద ముగ్గురం ఏదో ఒక క్రొత్త ప్రదేశానికి వెళ్ళి అలా, అలా తిరిగి వచ్చేవాళ్ళం సరదాగా. దాన్ని నడిపించడంలో అట్టే ప్రావీణ్యం శరత్‌కు లేకపోవడం వల్ల అప్పుడప్పుడు దాని మీదనుండి క్రిందపడి చిన్న చిన్న దెబ్బలు తగిలించుకునే వాళ్ళం. అది దార్లో ఎక్కడైనా చెడిపోయినా, పెట్రోలు అయిపోయి నిలచిపోయినా దాన్ని నెట్టుకుంటూ వచ్చేసే వాళ్ళం ఎన్ని మైళ్ళయినా, ఎంత రాత్రయినా... దార్లో చేన్లలోన వేరుశనక్కాయలు, తడిపొలాలలోని చెరుకులూ తస్కరించి తింటూ.

చాల సరదాగా, హుషారుగా, వేగంగా గడచిపోయిన ఆ రోజులను తలచుకుంటే ఇప్పుడు అదంతా ఏదో ఒక కలలాగా అన్పిస్తుంది.

రిజల్సు వచ్చాయి. శరత్, చైతన్యలు ఇద్దరూ సెకండ్‌క్లాస్ తెచ్చుకున్నారు. నేను అర్ధనరీగా ఒడ్డున పడ్డాను. మా ఊర్లోని బెసెంట్ దివ్యజ్ఞాన కళాశాలలో పి.జి. కోర్సులు లేవు. బయట ఊర్లకు వెళ్లి చదవగల ఆర్థిక స్తోమత, అనుకూల పరిస్థితులూ మా ముగ్గురికీ లేవు. ఉద్యోగాలు వస్తే ప్రయివేటుగా ఎందుకు చదువు సాగించకూడదు ? అనుకుంటూ వెయ్యి ఆశలతో లక్ష ఆశలతో ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టాము ఆశాజనకంగా కన్పించే అడ్వర్టైజ్‌మెంట్లు ఒకరికొకరు ఎక్చేంజి చేసుకునే వాళ్లం.

ఎన్నో ప్రయత్నాలు, ఎన్నో ఇంటర్వ్యూలు, ఎన్నో రిటన్ టెస్టులు...ఎన్నో. . ఎన్నో...గడచిపోయాయి.

నేను ఆశావాదిని. నేను ఎప్పుడో చదివిన ఒక కొటేషన్ "జీవితంలో సర్వస్వం కోలుపోయినా ఒక్కటి మాత్రం మిగిలే వుంటుంది... అదే భవిష్యత్తు!" నాకు ఎప్పుడూ మనసులో మెదులుతూనే ఉండేది. అందుకే ఎన్ని బాధలు, ఎన్ని మానసిక ఆవేదనలు వున్నా కలలలో, ఊహాలలో తేలిపోవడాన్కి ప్రయత్నిస్తూ కాలం గడపడం అలవాటు చేసుకున్నాను.

శరత్ నిరాశావాది. ఏ కాస్త బాధకీ తట్టుకోలేక తల్లడిల్లిపోయే రకం. అందుకే గాలి ఎటు వీస్తే అటు, ప్రవాహం ఎటుతోస్తే అటు కొట్టుకుపోవడం అలవాటు చేసుకునేశాడు

చైతన్య ఆప్టిమిస్టూ కాదు, పెసిమిస్టూ కాదు .మధ్యరకం. అయితే మా ఇద్దరికన్నా తను చాల తెలివైనవాడు. ప్రతి విషయంలోనూ మేము ఇద్దరం అతని సలహామీద ఆధార పడేవాళ్లం.

రోజులూ, వారాలూ, నెలలూ, సంవత్సరాలూ గడచిపోయాయి. గంటల తరబడి హాకీ ఆడి ఆ అలసటలో సర్వం మరచిపోగలగడం, మా ఊర్లో చూసిన సినిమాలనే సైకిళ్లమీద వెళ్లి పుంగనూరు, వాయల్పాడు లాంటి దగ్గర ఊళ్లలో మళ్లీ చూసిరాగల ఉత్సాహం, సైకిళ్లమీద యదేచ్ఛగా మైళ్ల తరబడి తిరిగి రాగల చాతుర్యం క్రమంగా తగ్గిపోసాగాయి మాలో. నిరాశా, నిస్పృహలచే ఓటమి ప్రారంభమైంది. ప్రకృతిని చూసి ఆనందించడంలో కూడా మాకు విషాదమే కన్పించసాగింది

జీవితం అంటే భయం, ఇన్‌ఫీరియారిటీ ఫీలింగ్, ఆనందంగా వున్నవాళ్లని చూస్తే ఒకరకమైన జలసీ మమ్మల్ని ఆక్రమించుకున్నాయి ఎక్కడ ఎప్పుడు కలిసినా జీవిత సమస్యలను చర్చించుకోవడంలోనే గడచిపోయేది కాలం. కాలం కదులుతూనే ఉంది నిరుద్యోగుల నిట్టూర్పులను మోసుకుంటూ

వెంకటేశ్వర్లుగారి అమ్మాయి స్మిత తనను



ఎంతో ప్రేమించే శరత్‌ను ప్రక్కకు నెట్టేసి గవర్నమెంటులో వెయ్యిరూపాయలు తెచ్చుకుంటున్న కిరీటిరావును పెళ్లి చేసుకునేసింది ఓ శుభ ముహూర్తాన. శరత్ ఎంత గాయపడేదీ అందరికీ తెలుసు! కానీ ఎవరు ఏం చేయగలరు?

తను జీవించినంత కాలమూ తన రక్తాన్ని చమటగా మార్చి రెండు ఎకరాల తడిపొలమూ, నాలుగు ఎకరాల పొడి పొలమూ మిగిల్చగలిగాడు శరత్ తండ్రి. తండ్రి మిగిల్చిన భూమిని తన ఉద్యోగంగా స్వీకరించాడు శరత్, వ్యవసాయం చేయించుకుంటూ. అష్టాంగ మార్గాన్ని ఫాలో అవుతూ కాలం గడిపేస్తున్నాడు శరత్.

చైతన్యకూ, నాకూ ఆ మాత్రం ఆధారాలూ లేవు.

నా విషయం, నాన్న కొచ్చే పెన్షన్‌తో మా సంసారం నడుస్తోంది. ఉన్న ఇల్లు ఉండనా, కూలిపోనా ? అన్నట్లుంది. సంవత్సరం క్రితం పలమనేరులో ఓ ప్రయివేటు కంపెనీలో నెలకు మూడువందల రూపాయలు జీతం వచ్చే ఓ గుమాస్తా ఉద్యోగం దొరికింది నాకు. గుమాస్తా ఉద్యోగం అని పేరే కానీ అక్కవుంట్స్ వ్రాయడం మొదలుకుని కూరగాయలూ, టీలూ, కాఫీలూ, మోయడం వరకూ చేయాల్సిందే చెప్పిన ప్రతి పనీ. అయినా 'బయట ఊరు, నేను ఏంచేస్తున్నదీ ఎవరు చూడవచ్చారు ?' అని నన్ను నేను ఊరడించుకుని 'రెండువందల రూపాయలు ఖర్చయిపోయినా వంద అయినా ఇంటికి పంపవచ్చు కదా ? ... ముసలి వాళ్లకు భారంగా ఉండడంకన్నా ఇది నయం కాదూ' అని ఆత్మను సంతృప్తి పరచుకుని కాలం గడిపేస్తున్నాను, భవిష్యత్తును గూర్చి కలలు కంటూ; ఊహాలలో అపర్ణతో రంగుల జీవితం గడుపుతూ.

చైతన్యకు, ఈ మాత్రం ఉద్యోగమూ దొరక లేదు. అతని తండ్రి ప్రయివేటు సంస్థలో పని చేసిన వాడు కాబట్టి పెన్షన్ వగైరాలు ఏమీ రావు. తాను సంపాదించిన దాంతో ఇంతకాలం లాక్కువచ్చాడు. ఇప్పటికీ అక్కడక్కడ పద్దులు వ్రాస్తూ ఏదో తన చేతనైంత సంపాదిస్తూనే ఉన్నాడు ఆయన. చైతన్య తల్లి జబ్బు మనిషి. సదా మందులు తింటూ ఉండాల్సిందే. చైతన్య చెల్లి ఇంటర్ పాసయింది. టైపు తెలుసు, చిన్న ఉద్యోగం దొరికితే చేయాలని తనూ ప్రయత్నిస్తోంది. కానీ ఆమెకూ ఏమీ దొరకడం లేదు. చైతన్య ఎంత తటస్థజీవి అయినా వృద్ధులైపోయిన తల్లిదండ్రులనూ, పెళ్లికెదిగిన చెల్లినీ చూస్తూ తన అసమర్థతను తలచుకుని ఎంతో నలిగిపోతున్నాడని నాకు బాగా తెలుసు.

ఆ మధ్య నేను ఊరు వెళ్లినప్పుడు ముగ్గురూ కలిసి మాట్లాడుతోండగా అన్నాడు "మనకి గవర్నమెంటు ఉద్యోగాలు పొందే వయసు దాటి పోతోందిరా ... ఒక్కోరోజు గడుస్తూంటే ఒక్కో అడుగు పాతాళ లోకానికి దిగబడి పోతున్నట్లుగా ఉందిరా నాకు. ఆలోచించి ఆలోచించి తల బ్రద్దలై పోతోంది. సెర్రిబల్ హెమరేజ్ వచ్చేస్తుందేమోనని భయంగా కూడా ఉంది ! 'నా వాళ్లకు నేను న్యాయం చేకూర్చగలనా ?' అనే దిగులు నన్ను తినేస్తూ వుందిరా !"

తన దగ్గర్నుండి సలహాలూ, ధైర్యమూ పొందామే తప్ప తనకి ఏ నాడూ మేము ధైర్యం చెప్పాల్సిన అవసరం రాలేదు అంతదాకా. తనకేం చెప్పము ? ఎలా ధైర్యాన్నివ్వము ? ? ఏమని ? ?

*  *  *

బొయ్యిమని వాక్యూం హారన్ వినిపించడంతో ఉలిక్కిపడి ఆలోచనలనుండీ బయటపడి లేచి నిలబడి వస్తున్న లారీని ఆపాను.

"కా జానా ?" అని అడిగాడు మహానిర్లక్ష్యంగా క్లీనరు.

"మదనపల్లి !" అన్నాను.

"అడే రూపాయి దేనా !" అన్నాడు.

'రెండున్నర రూపాయికాదు పాతిక రూపాయలైనాఇస్తాను' అనుకుని తలవూపి లారీ ఎక్కేసి డ్రయివరు వెనకనున్న సీటుమీద కూర్చున్నాను.

చైతన్యకి ఎలా ఆక్సిడెంట్ అయిందో, ఏం జరిగిందోనని ఊహించడాన్కి రకరకాల ఆలోచనలతో మథనపడూ ముండ్లమీద కూర్చున్నట్లు కూర్చున్నాను లారీ కేబిన్‌లో.

నాలాగే ఏహో అర్జంటు పనులమీద వెళ్ళాల్సిన మరో నలుగురిని పుంగనూరులో ఎక్కించుకుని వేగంగా ప్రయాణం చేసిన లారీ మదనపల్లి చేరగానే యం. యల్. యల్. హాస్పటల్ వద్ద లారీ ఆపించి దిగేశాను.

*  *  *

చైతన్య పేరు కలిగిన పేషంటు ఎవరూ అడ్మిట్ అయివుండలేదని చెప్పాడు హాస్పటల్ రెసెప్షనిస్టు. కాని ఆక్సిడెంట్ల తాలూకు పేషంట్సుని గవర్నమెంటు హాస్పటల్‌కే తీసుకు వెళ్తారని అంతదాకా స్ఫురించలేదు నాకు. సీరియస్ అని టెలిగ్రాంలో ఉంది కాబట్టి నేను ఇంకేమీ ఆలోచించకుండా గబగబా వెలుపలికివచ్చి హాస్పటల్ కాంపవుండ్ దాటి రిక్షా ఎక్కి గవర్నమెంటు హాస్పటల్‌కు వెళ్ళమన్నాను.

హాస్పటల్ గేటులోనే ఎదురయ్యాడు శరత్ బాగా నల్లబడిపోయిన ముఖంతో.

"ఆత్రుతగా రోడ్ క్రాస్ చెయ్యబోయి ఎలాగో లారీ క్రింద పడ్డాడురా మనవాడు. లారీ చక్రము కుడి తొడమీద నిలచిందటరా. తొడ బాగా దెబ్బతిని నలిగిపోయింది మోకాలిపైన. సియాటిక్ నర్వు దెబ్బతినిందట పైగా కిడ్నీ పంక్చరు అయిందటున్నారు... మోస్ట్లీ బ్రతకడురా... బ్రతికినా కాలు తీసివేయాల్సి వస్తుంది. ఇంతవరకూ తెలివి రాలేదు వాడికి. వెళ్ళిచూడు...." అన్నాడు శరత్ చిన్న పిల్లివాడిలా రెండు చేతులతో కన్నీరు తుడుచుకుంటూ.

కలో, నిజమో తెలియని పరిస్థితి ... షాక్ కాదు... అలాగని నేను నిల్రదొక్కుకున్నాననీ చెప్ప లేను... ఒక్క నిముషం అలాగే నిలబడిపోయాను అచేతనంగా. ఆపై కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది. నిల్రదొక్కుకోలేక తూలిపోతూంటే శరత్ పట్టుకున్నాడు కంగారుగా... నన్ను.

*  *  *

డాక్టర్లు, నర్సులూ తాము చేయగలిగిందంతా చేస్తున్నారు. బ్లడ్, ఆక్సిజన్ పంపుతున్నారు వాడి శరీరంలోకి. ప్రతి పావుగంటకీ వాడి పరిస్థితి చెక్ చేస్తున్నారు. అయితే ప్రతి ఒక్కరికీ తెలుసు పక్షి ఎగిరిపోతుందని. నిలవదని తెలిసినా నిలపడాన్కి ప్రయత్నించే తపన, ఆత్రుత, ఆశ ఇవి చాలా చిత్రమైనవి.

ఆపరేషన్ అయిన తరువాత ఆపరేషను సక్సస్ అయింది లేనిదీ చెప్పలేదట డాక్టర్లు బహుశా వాళ్ళకే నిర్ధారణగా తెలిసి ఉండదు.

మంచం దగ్గర బొమ్మల్లాగా కూర్చుని వున్నారు చైతన్య తల్లీ, చెల్లీ. వాళ్ళ వెనుక నిలబడి వున్నారు మా అమ్మా, శరత్ వాళ్ళ అమ్మా. బయట వసారాలో ఎంతోమంది పరిచయస్థులూ, దూరపు బంధువులు నిలబడి వున్నారు. ఇవతలివైపు వున్న నడవాలో గోడకు ఆనుకుని నిలబడివున్న వృద్ధతండ్రి గాజు కండ్లలో కన్నీటి పొరలు . వాటి వెనుకనుండి నిరాశా అగాధాల నధిగమించి ముందుకు రావడాన్కి వ్యర్థ ప్రయత్నం చేస్తున్న ఆశాకిరణాలు ఆయనకీ తెలుసు తన చైతన్య తనకిక దక్కడని. తెలిసీ ఏదో తెలియని వెర్రి ఆశ...మనిషి ఆశాజీవి.

ఆశ అనే గడ్డి పరకను పట్టుకుని నిరాశ అనే మహా సముద్రంలో మునిగిపోకుండా వుండడానికి ప్రయత్నించే వింత ప్రాణి మనిషి. ఆయనకు ధైర్యం ఇస్తున్నట్లుగా ఆయన వెనుకనే నిలబడి వున్నాడు మా నాన్న.

నాకు దుఃఖం ఆగడం లేదు వీళ్ళందరినీ చూస్తూ వుంటే. ఎందుకో మంచంలో వున్న చైతన్యను చూసినప్పటికన్నా, వీళ్లను చూస్తూ వుంటేనే దుఃఖం పార్లి పార్లి వస్తోంది. అందుకే అక్కడ వుండలేక నెమ్మదిగా హాస్పటల్‌లోంచి వెలుపలికి వచ్చాను.

నెమ్మదిగా నడచి ఫర్లాంగు దూరంలో ఉన్న కాలేజి గ్రవుండు చేరుకున్నాను. ప్రేక్షకుల మెట్ల మీద పై మెట్టుమీద కూర్చున్నాను. సూర్యుడు అస్తమించాడు.

హాకీ గ్రవుండు ఖాళీగా ఉంది. వెనుక కాస్త దూరంలో గిరిరావు హైస్కూలు గ్రవుండులో విద్యార్థులు పుట్‌బాల్ ఆడుతున్నారు. ఆ చివర్న బ్యాట్‌మింటన్ కోర్టుతో ఎవరో అమ్మాయిలు బ్యాట్‌మింటన్ ఆడుతున్నారు. చుట్టూ ఎటు చూసినా చెట్లు, ఆ వెనుక దూరంగా కొండలు కన్పిస్తున్నాయి. మదనపల్లెలోని ప్రత్యేకత అదే...ఎటు చూసినా ఊరిని చుట్టుముట్టి చెట్లూ, కొండల వరుసలూ! పైన ఆకాశంలో నివాసాలు చేరుకోవడాన్కి వెళ్తున్న పక్షులు... అంతా నాకు ఎందుకో ఎప్పుడూ లేనంత ప్రత్యేకత కన్పించి... ఓ రకమైన ఆవేదనను కలిగించాయి. మైదానం కుడి ప్రక్కనున్న ముసల్మానుల బరియల్ గ్రవుండులోని ఎరుపు, తెలుపు రంగుల సమాధులు వింతగా కన్పిస్తూ మానవుని అస్థిరతను చూపిస్తున్నట్లున్నాయి.

ఈ మైదానంలో ఎన్నో వందలసార్లు హాకీ ఆడాడు చైతన్య మాతో.. ఇంక ఆడగలడా ? నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి...వాడు బ్రతికినా...ఈ మైదానంలో రెండు కాళ్ళూ పెట్టి నడువలేడు.

కాస్సేపయ్యాక అక్కడ్నుంచీ లేచి స్టేటు

బ్యాంకు రోడ్‌మీదుగా బెంగుళూరు బస్టాండుకు వచ్చి అక్కడ్నుండీ దక్షిణపేటమీదుగా ఓల్డు చిత్తూరు బస్టాండుకేసి నడిచాను. నడుస్తూవుంటే 'ఈ రోడ్ల మీద ఎన్నోవేలసార్లు తిరిగి వుంటాడు చైతన్య చిన్నప్పటి నుండీ ఇక తిరగగలడా ? లేక ఋణం తీరిపోతోందా??' అని అన్పించి గుండెలో ముళ్ళు గుచ్చుకున్నట్లుగా బాధకలిగింది.

ఓల్డు చిత్తూరు బస్టాండులోని హోటల్ చేరుకున్నాను. దాదాపు హోటల్ అంతా ఖాళీగానే వుంది. ఓ కుర్చీలో కూర్చుని టీ తెమ్మన్నాను.

మా పరిచయం పెరిగింది ఈ హోటల్‌లోనే. కొన్ని వందలసార్లు ఈ హోటల్‌లో టీ త్రాగి వుంటాము. ఈ రేకుల హోటల్‌లో టీ త్రాగే మమ్మల్ని చూసి చాలమంది మిత్రులు నవ్వేవారు... కానీ వాళ్ళకేం తెలుసు ఈ హోటల్ విలువ ? ఇందులో మాకు లభించే తృప్తి !

'ఈ హోటల్‌లో చైతన్య మళ్ళీ టీ త్రాగుతాడా ?' ఈ ప్రశ్న నా గుండెలని కెలకడం మొదలు పెట్టింది. టీ కప్పు నా ముందుకు వచ్చింది

హోటల్ కౌంటర్‌లో ఉన్న వ్యక్తి పూర్తయిపోయిన రికార్డు తీసివేసి క్రొత్త రికార్డు పెట్టాడు రికార్డు ప్లేయర్‌లో. మేరానాం జోకర్ లోని పాట ప్రారంభమైంది.

"జీనా యహా ! మర్‌నా యహా !! ఇసేకే సివా జానా కహా ??"

తన కథతో కే. ఎ. అబ్బాస్ ఏం చెప్పదలచుకున్నదీ నాకు కొద్దిగా తోచినట్లయింది. ఆ పాట పాడిన వ్యక్తీ, ఆ పాటకు సంగీతం సమకూర్చిన జంటకళాకారులలో ఒక వ్యక్తి ప్రస్తుతం ఈ లోకంలో లేరు. పాట మాత్రం ఉంది ... ఉండిపోతుంది !

తల వంచుకున్నాను... నా కళ్ళలోంచీ కన్నీటి చుక్కలు జారి టీ కప్పులో, సాసర్లో పడుతున్నాయి.

* * *

ఆక్సిడెంటును గూర్చి తెలియగానే శరత్ వాళ్ళ అమ్మా, మా అమ్మా. నాన్నా ఉదయం అనగా హాస్పటల్‌కు వచ్చేశారు. తిండి తిప్పల ధ్యాసలేకుండా చైతన్య తల్లి దండ్రులకూ, చెల్లికీ ధైర్యాన్ని ఇస్తూ వుండిపోయారు. రాత్రంతా కూడా ఇలాగే ఉండిపోతారు.

నాకు ఆశ్చర్యం వేసింది. ఈ ముసలివాళ్ళకు వున్న ఓపికా, గుండె నిబ్బరమూ, మనుషులమీద భ్రమా, ఎదుటివాళ్ళకు ధైర్యం చెప్పాలనే, ఓదార్చాలనే తహతహా, తాపత్రయమూ యువకులలో ఉండవు సామాన్యంగా.

మా ముగ్గురి ఇండ్లూ తాళాలు సరిగ్గా వేసి వున్నాయో లేవో చూసి రావడానికి శరత్ వెళ్ళాడు సైకిల్ మీద. నేను నడచి వెళ్ళి ఓ భోజనం హోటల్‌లోంచీ రెండు కారియర్లలో భోజనం తీసుకు వచ్చాను. అయినా ఒక్కరూ ఎంగిలిపడ్డ పాపాన పోలేదు. మృత్యువుతో పోరాడుతున్న చైతన్యని చూస్తూ కూర్చున్నాము అంతా.

* * *

రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో చైతన్య పరిస్థితి విషమించింది. శరత్ పరుగెత్తుకు వెళ్ళి హాస్పటల్ కాంపవుండ్‌లోనే క్వార్టర్సులో ఉన్న మెడికల్ సూపరెండెంటుని తీసుకు వచ్చాడు. ఆయన చైతన్యను పరీక్షించి, చాల నిముషాలు ఆలోచించి, ఓ ఇంజెక్షన్ తెప్పించి తనే స్వయంగా ఇంజక్షన్ చేసి మౌనంగా వెళ్ళిపోయాడు.

"కాస్సేపట్లో తెలివి రావచ్చు ... రాకపోవచ్చు . తెలివి వచ్చినా రాకపోయినా అరగంటకన్నా ఎక్కువ సేపు బ్రతకడు !" అన్నాడట వెంటవెళ్ళిన శరత్‌తో. శరత్ నాతో అన్నాడు. తక్కిన వారికి ఈ విషయం తెలియక పోయినా ప్రతి ఒక్కరి ముఖంలోనూ టెన్షన్ కొట్టొచ్చినట్ల కన్పిస్తూనే వుంది.

పది నిముషాలలో చైతన్యకి కొద్దిగా . చాల కొద్దిగా తెలివి వచ్చింది. అయితే వాడు మమ్మల్నెవర్నీ గుర్తించ లేక పోయాడు. బ్లడ్ వాడి శరీరంలోకి ఆగి ఆగి వెడుతోంది ... చివరికి వాడి పెదవులు కదిలాయి.

"లారీ డ్రయివరు తప్పేమీ లేదు ! నేనే త్వరగా రోడ్డు దాటపోతూ ... పడిపోయాను . డ్రయివరు తప్పేమీ లేదు...తప్పేమీ లేదు ."

ఇవే వాడి ఆఖరి మాటలు ఈ ప్రపంచంలో.

* * *

"దిస్ వరల్డ్ ఈజ్ ది లాండ్ ఆఫ్ డైయింగ్ అండ్ ది నెక్స్ట్ ఈజ్ ది లాండ్ ఆఫ్ లివింగ్" అన్నాడు టైరాన్ ఎడ్వర్డ్స్. ఆయన మాటలు నిజం అయివుంటే మృత్యు సంబంధమైన ఈ లోకంలో శాశ్వతంగా నిద్రపోయిన చైతన్య ఎక్కడో మరో లోకంలో కళ్ళు తెరచి వుండాలి ఈసరికి

మనకి ఎంత ప్రాణ సమానమైన వాళ్లయినా చనిపోయాక వాళ్లని ఎన్నో గంటలు మన వద్దనే ఉంచేసుకోలేము. అందునా ఆక్సిడెంటుకు గురయిన వాళ్ల శవాన్ని దగ్గర ఉంచుకోవడానికి అట్టే సేపు వీలవదు.

చైతన్య తల్లిదండ్రుల కడుపు కోతనీ, అతని చెల్లి దుఃఖాన్నీ చూస్తూ వుంటే కఠిన శిలలు కూడా కరిగి నీరయిపోతాయని అన్పిస్తోంది. శరత్ అందర్నీ చూస్తూ ఏడుస్తున్నాడు చిన్నపిల్లవాడిలా. ఏడుస్తూ అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాడు

చైతన్య శవం స్నానం చేయించడానికి వీలు లేని స్థితిలో ఉంది. వేడినీళ్లతో శవాన్ని తుడిచి, తెల్లటి కొత్త బట్టతో శవాన్ని చుట్టి . . పెళ్లి కానివాడు కాబట్టి ఓకే కొయ్యకు శవాన్ని కట్టి పూలతో అలంకరించి ఆఖరి యాత్రకు సిద్ధం చేశారు.

శరత్ ఒకవైపు, నేను ఒకవైపు భుజాలకు శవాన్ని ఎత్తుకుని బయల్దేరాము. వెనుక నుండీ ఏడ్పులతో, దుఃఖాలతో అందరూ కదలి వచ్చారు

మా ఊర్లో శవాల్ని బూడిద చెయ్యడానికి ఆధునిక యంత్ర పరికరాలు లేవు. అసలు ఆ ఎలక్ట్రిక్ పద్ధతే ఇప్పట్లో రాదు ఇక్కడికి. కొందరు తమ పద్ధతుల ప్రకారం శవాలని పాతిపెడ్తారు కొందరు తమ పద్ధతుల ప్రకారం కట్టెలతో శవాలని కాల్చివేస్తారు మా ప్రాంతంలో


చైతన్య శవాన్ని వాళ్ల పద్ధతి ప్రకారం పాతిపెట్టాము. శవం మన్నుతో కప్పబడి పోతున్నప్పుడు . నా చైతన్య మన్నులో మన్నయిపోతున్నప్పుడు ఎప్పుడో ఎక్కడో చదివిన ఓ వాక్యం గుర్తువచ్చింది నాకు.


"మనం మంచు ముద్దలతో బొమ్మలని చేస్తాం అవి కరిగిపోతూ వుంటే చూసి విలపిస్తాము."

* * *

బుద్బుద ప్రాయమైన మానవ జీవితాన్ని గూర్చి ఆలోచిస్తూ కూర్చుని వున్నాను. చైతన్య చనిపోయి అప్పుడే నాలుగురోజులు గడచిపోయాయి.

నెమ్మదిగా శరత్ వచ్చి నా ముందున్న



కుర్చీలో కూర్చున్నాడు. "ఏమయినా ఆలోచించావావా ?" అని అడుగుతూ.

"చాల ఆలోచించానురా...కానీ నా ఆలోచనలు ఒక కొలి! రావడంలేదు !" అన్నాను నేను నీరసంగా.

"పోనీ నేను ఆలోచించి చెప్పనా ?"

"చెప్పు !" అన్నాను సరిగ్గా కూర్చుంటూ.

"తాత్కాలికమైన ఈ దుఃఖం కన్నా, వాళ్ల భవిష్యత్తును గూర్చి ఎక్కువ ఆలోచించాలిరా మనం. వాళ్ల వద్ద ధన, ధాన్యాలేమీ లేవు. వాళ్ళకున్న ఒక్క ఆశాకిరణమూ మాయం అయిపోయింది. గుండెలమీద కుంపటిలా ముసలి వాళ్ళకి అంజూ మిగిలివుంది..." అంటూ ఆగాడు వాడు.

"ఊఁ చెప్పు!" అన్నాను.

"నేను జాబ్ అవసరం లేకుండా ఇండిపెండెంటుగా బ్రతకడం నేర్చుకుంటున్నాను. నా జీవితానికి ఇక భయం లేదనే నా నమ్మకం! అందుకే నేను అంజూని వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నాను!"

నిరాశావాది శరత్...ఎంత ఆలోచించాడు ? ఎంత విశాల హృదయం వాడిది?? స్నేహానికి ఎంత ప్రాముఖ్యత ఇస్తున్నాడు వాడు?

వాడిని చూస్తుంటే మిత్రుడైనందుకు నాకు ఎంతో గర్వం కలిగింది. నా గుండెల్లోని బరువేదో దిగిపోయినట్లయింది.

అంజూ సమస్య ఇంత తేలికగా పరిష్కరింపబడిపోతే చైతన్య తల్లిదండ్రులు ఉన్నదాంతో కాలం వెళ్ళబుచ్చగలరు. మంచి చెడులు చూడడానికి మేము ఉండనే వుంటాము.

"మీ అమ్మగారు ఏమంటారు?"

"నిన్న అమ్మే సలహా ఇచ్చిందిరా నాకు... అంజూని చేసుకొమ్మని."

"అబ్బ ఎంత విశాలమైనవి ప్రపంచంలో కొందరి హృదయాలు? చదువు అంటే ఏమిటో తెలియని శరత్ అమ్మగారి హృదయంలో ఎంత మంచితనం, స్నేహభావాలు నిండివున్నాయి ?" అనుకున్నాను.

*　　*　　*

పెద్ద ఖర్మ పూర్తయిపోగానే బయల్దేరి వెళ్ళి పలమనేరు చేరుకున్నాను. గది తాళంతీసి లోపల ప్రవేశించగానే దుమ్ముపేరుకున్న నేలమీద పడివున్న కవరు కన్పించింది. నా శరీరంలోని రక్తం వడివడిగా ప్రవహించింది. కవరుమీది చేతిప్రాత చైతన్యది.

గబగబా కిటికీ తలుపులు తెరచి కుర్చీలో కూర్చుని కవరు చింపి అందులోని కాగితం వెలుపలికి తీశాను ఎక్సయిటెడ్‌గా.

ప్రియమైన రాజా!

రేపటితో నాకు ముప్పయి నాలుగు సంవత్సరాలు పూర్తయిపోతాయి. ఈ కాలపు సగటు మనుషుల జీవిత కాలము డెబ్బయి సంవత్సరాలు. అంటే నా వయసు దాదాపు సగం అయిపోయినట్టే. నేను నిస్సారంగా గడచిపోయిన నా సగజీవితాన్ని గూర్చి ఆలోచించడంలేదు. నా భవిష్యత్తు ఏమిటా అని.

నాకు ఏమివుంది? ఆస్తిలేదు, ఐశ్వర్యంలేదు... నాకున్నది నామీదే ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులూ, చెల్లీ! వాళ్ళకు నేనెలా న్యాయం చేకూర్చను? నేను కట్టుకున్న భవిష్యత్తు అనే కలల సౌధం కూలి పోవడాన్కి ఇంకా 24 గంటల వ్యవధి వుంది అంతే! ఎల్లుండిమండీ నేను ఏ గవర్నమెంటు ఉద్యోగానికీ పనికిరాను, ఏ రిటన్ టెస్టు వ్రాయడానికీ పనికిరాను. నా ఆశలన్నీ రేపటితో బూడిద అయిపోతాయి.

ప్రయివేటులో ఏదయినా ఉద్యోగం దొరికినా నేను నిలద్రొక్కుకోగలనా ? నెవర్! ఆ అవస్థలు నాకు తెలియనివి కావు.

మనం వెనుకబడ్డ జాతిలోనో, తెగలోనో పుట్టి వుండినా ఇంకో ఐదు లేక పది సంవత్సరాలు అవకాశాలు వుండేవి కదా అని బాధపడ్తూ వుంటే నాకో విషయం స్ఫురించింది.

వికలాంగులకు కొన్ని సంవత్సరాల వరకూ వయో పరిమితి సడలించబడడమే కాక వారికి ప్రత్యేక కేటాయింపులుకూడా ఉంటాయి.

నా మానసిక పరిస్థితి, నా ఆవేశం అంతా నీకు వ్రాయదలచుకోలేదు. నీవు అర్థం చేసుకోగలవని నాకు తెలుసు. అందుకే నేను తీసుకున్న నిర్ణయం నీకు వ్రాసేస్తున్నాను.

రేపు నేను కంగారుగా రోడ్డు దాటడాన్ని ప్రయత్నిస్తున్న వాడిలా. గభాలున... ఏదయినా ఓ వాహనం క్రింద పడిపోయి నా కాలు ఒకదాన్ని ఆ వాహనానికి అర్పించదలచుకునేశాను. ప్రపంచం దృష్టిలో ఇది ఒక ఆక్సిడెంట్ మాత్రమే! హాండీకాప్ సర్టిఫికెట్టుతో భవిష్యత్తును నిర్మించుకుని నావాళ్ళకు న్యాయం చేకూర్చాలన్నదే నా కోరిక.


వైవిధ్యంగల వ్యాసాలకు

భారతి మాసపత్రిక

చదవండి!


ఒకవేళ నా ఈ ప్రయత్నంలో ఏదయినా అవకతవకలు జరిగి నా ప్రాణం పోవడం జరిగితే నా కుటుంబాన్ని నీవూ, శరత్ ఆదుకోవాలి.

ఇక్కడ ఇంకొ విషయం చెప్పాలి నీకు. దాదాపు ఐదు సంవత్సరాల క్రితం అనుకుంటాను ... నా పరిచయస్థుడు ఒక ఇన్సూరెన్సు ఏజంటు బలవంతంగా నా చేత పదివేల రూపాయలకు డబుల్ ఆక్సిడెంటల్ బెనిఫిట్ స్కీములో ఇన్సూర్ చేయించాడు. అదృష్టవశాత్తు దాని తాలూకు ప్రీమియములు సక్రమంగా చెల్లించగలిగాను ఇంత వరకూ. ఈ విషయం మా వాళ్ళకెవరికీ తెలియదు. దాని తాలూకు రసీదులూ, భీమా సంస్థ ఇచ్చిన బాండూ ఉన్న ఫైల్ నా బట్టల పెట్టో అడుగున పడివుంది.

నేను ఈ లోకం నుండి నిష్క్రమించడమే జరిగితే నీవు, శరత్ ఆ ఫైలు తీసుకుని... నా చావు ఆక్సిడెంటే (ఈ ప్రపంచానికి) కాబట్టి ... యల్. ఐ. సీ. నుండి ఇరవయివేల రూపాయలు వసూలు చేసి ఆ డబ్బుతో నా చెల్లి పెళ్ళి, నా తల్లితండ్రులకు కొంత ఆధారమూ కలిగించాలి. ఇది ఫ్రాడ్ అని నాకు తెలుసు ... కానీ ... కానీ ... నా వాళ్ళకోసం, నా భవిష్యత్తు కోసం నేను చేస్తున్న ఆఖరి ప్రయత్నం విఫలం అయిపోతే ... ఫ్రాడ్‌గా అయినా సరే భీమా సంస్థ అనే మహానదిలోంచీ నేను కొద్దిగా ధనం అనే నీరు నా వాళ్ళకోసం పొందక తప్పదు.

అన్నీ సక్రమంగా జరిగి నేను హాండీకాప్‌గా ప్రపంచంలో నిలవాలని భగవంతుని ప్రార్థిస్తూ ఉత్తరం ముగిస్తున్నాను

నీవు చదవడం ముగించగానే ఈ ఉత్తరాన్ని కాల్చిపారవెయ్యాలని కోరుతున్నాను.

భగవంతుడు అన్యాయం చేయడని ఆశిస్తాను నీ

ప్రియమిత్రుడు,

చైతన్య.

ఉత్తరం చదవడం ముగించిన తరువాత నేను దాదాపు ఓ గంటసేపు అలాగే కుర్చీలో కూర్చుండిపోయాను మ్రాన్పడిపోయి

'చైతన్యా ఎందుకిలా చేశావు ? ఎందుకిలా చేశావు ??' అనుకుంటూ, తల కొట్టుకుంటూ, జుత్తు పీక్కుంటూ విలపించాను ఆప్తై—

చివరికి నాకు కర్తవ్యం గుర్తుకు వచ్చింది.

కుర్చీలోంచి లేచి అగ్గిపెట్టె వెతికి తీసుకుని ఉత్తరం కాల్చిపారవేశాను చైతన్య కోర్కెలలో ఒకటి నెరవేరింది అనుకుని నవ్వుకున్నాను.

అతని ఇంకో కోరిక కూడా నెరవేరింది దాదాపుగా ఇదివరకే! అంజూ పెళ్లి .. రెండునెలల తరువాత శరత్‌తో జరిగిపోయేటట్లు ముహూర్తం కూడా నిశ్చయింప బడిపోయింది. అయినా ఆ డబ్బు పికప్ చేసుకుని చైతన్య తల్లిదండ్రులకు అందించాలి నేను.

తెచ్చిన హ్యాండ్‌బ్యాగు తెచ్చినట్లే అందుకుని గది తాళం వేసి బస్టాండుకు బయల్దేరాను. బహుశా మా కంపెనీ యజమానులు నాకు వెయ్యి చీవాట్లతో పెద్ద మెమో తయారు చేయవచ్చు బట్ ఐ డోంట్ కేర్ ...

బస్టాండుకు చేరుకునేసరికి వేలూరు నుండి వచ్చిన టి. కే. టి. బస్ సిద్ధంగా ఉంది. ఎక్కి ఖాళీగావున్న ఓ సీట్లో కూర్చున్నాను కాస్సేపట్లోనే బస్ బయల్దేరింది.

కిటికీ గుండా కన్పిస్తున్న దృశ్యాలను భావశూన్యంగా చూస్తూ వున్న నా మనసుకు హఠాత్తుగా ఒక విషయం తట్టింది. దాంతో ఉలిక్కిపడిన నేను భయంతో వణికిపోయాను.

భవిష్యత్తు మీద ఆశతో నేను వెట్టిచాకిరీ లాంటి ఉద్యోగం చేస్తూ గడిపేస్తున్నాను. ఈ ఉద్యోగంలో వుండి అందుకోలేనని తెలిసినా నేనింకా అపర్ణను ప్రేమిస్తూనే వున్నాను. మంచి ఉద్యోగం దొరుకుతుందనీ, అపర్ణను అందుకొగలననీ, నన్ను కన్నవాళ్లకూ న్యాయం చేకూర్చగలననీ నమ్ముతూనే బ్రతుకేస్తున్నాను బావిలో కప్పలా, పుట్టలో చెదపురుగులా.

కానీ ...

నేను చైతన్యకన్నా మూడు నెలలా, పద్నాలుగు రోజులు మాత్రమే చిన్నవాణ్ణే ... అంటే ఇంకో మూడు నెలలలోగా ... ... ?

★